A1TV NEWS

# ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 53 మంగళవారం - 22 -ఆగస్ట్ - 2023 పేజీలు 4. వేల :4 /

# ప్రజలకు సంక్షేమం..
## ఉద్యోగులకు భరోసాగా ప్రభుత్వ పాలన.

⏭ ఉద్యోగుల జీతాల ఖర్చు 1100 కోట్ల నుండి 3300 కోట్లకు పెరిగిన చిరునవ్వుతో అందిస్తున్నాం.

⏭ మన ప్రభుత్వ విజయంలో ఉద్యోగుల కృషి అభినందనీయం.

⏭ దసరా నాటికి డీఏ అందిస్తాం.

⏭ ప్రభుత్వ వ్యవస్థలు బాగుంటేనే ప్రజలు బాగుంటారని నమ్మే ఫ్రెండ్లీ ప్రభుత్వం మనది.

⏭ ఏపీ ఎన్జీవో 21వ రాష్ట్ర మహాసభల్లో సీఎం జగన్

ఆంధ్ర ప్రగతి విజయవాడ ఆగస్టు 21:
ఏపీలో ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీగా ఉంటోందని సీఎం జగన్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే 1.35 లక్షల నూతన ఉద్యోగాల భర్తీతో పనిభారం తగ్గించామని వివరించారు. ఏపీ ఎన్ జోవో అసోసియేషన్ విజయవాడలో సోమవారం నాడు నిర్వహించిన 21వ రాష్ట్ర మహా సభలో సీఎం జగన్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం కనీసం ఊహించని ఆర్టీసీని తాము అధికారంలోకి రాగానే ప్రభుత్వంలో విలీనం చేసినట్లు తెలిపారు. చంద్రబాబు ఎన్నికలకు ఆరు నెలల ముందు మాత్రమే జీతాలు పెంచగా.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే ఉద్యోగులకు పెంచిన జీతాలు చెల్లిస్తోందని వివరించారు. ఉద్యోగుల జీతాల ఖర్చు గతంలో రూ. 1,100 కోట్లు ఉండగా నేడు రూ. 3,300 కోట్లకు చేరిందని అయినా ఉద్యోగుల కోసం చిరునవ్వుతో భరిస్తున్నామని పేర్కొన్నారు. ఏపీలో గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటుతో ప్రభుత్వ ఉద్యోగాల కల్పన, గ్రామ స్వరాజ్య సాధనలో దేశానికే దిక్సూచిగా నిలిచిందని తమ ప్రభుత్వ సక్సెస్ కు కారణం ఉద్యోగులే అంటూ సీఎం జగన్ పేర్కొన్నారు.

జీపీఎస్ పెన్షన్ స్కీమ్‌కు ఆర్డినెన్స్ వస్తుంది.

ప్రభుత్వం మీద అసాధ్యమైన బరువు పడకుండా, ప్రభుత్వాలు భారం ఎక్కువై భవిష్యత్తులో చేతులు ఎత్తేసే పరిస్థితి రాకుండా, అదే సమయంలో ఉద్యోగులు రిటైర్డ్‌మెంట్ అయిన తరువాత చిరునవ్వుతో బతికేలా, వారికి న్యాయం జరిగేలా ఏకంగా




చట్టాన్ని ఆర్డినెన్స్‌కు కూడా పంపించామని సీఎం జగన్ తెలిపారు. ఈ పెన్షన్ స్కీమ్ రాబోయే రోజుల్లో దేశమే మన రాష్ట్రానికి వచ్చి కాపీ కొట్టి అమలు చేస్తుందని అన్నారు.

రాజకీయ విమర్శలను నమ్మవద్దు

రాష్ట్ర ప్రజల మీద, ఉద్యోగుల మీద ఎవరి మీదా గత పాలకులు ప్రేమ లేదని, వీరు చేసే రాజకీయ విమర్శలు, రెచ్చగొట్టే వీరిమాటల్ని, కట్టు కథల్ని నమ్మవద్దు అని సీఎం కోరారు. పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగుల మీద పగబట్టి భౌతిక దాడులు జరుపుతున్నారని, 47 మంది పోలీసులపై పుంగనూరులో దాడి చేశారని గుర్తు చేశారు.

దసరా పండుగనాటికి డీఏ అందిస్తాం.

ఉద్యోగుల ప్రయోజనాలు, వారికి మంచి చేసే విషయంలో ఎక్కడా వెనక్కు తగ్గే పరిస్థితి లేదని సీఎం ఉద్ఘాటించారు. 2 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, 2022 జూలై 1కి సంబంధించిన డీఏ దసరా పండుగనాడు అందరికీ ఇచ్చే కార్యక్రమం చేస్తానని సీఎం హామి ఇచ్చారు.


# కులాల కుమ్ములాటలో దూరొద్దు..

**- యువకులకు వెంకయ్య సూచన**

**యువతే దేశానికి భవిష్యత్తు అన్న వెంకయ్య**

**ఇష్టపడి, కష్టపడి చదవాలని సూచన**

**ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు బానిసలు కావద్దని హితవు**



కులాల కుమ్ములాటలో యువకులు దూరొద్దని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచించారు. యువతే ఈ రాష్ట్రానికి, దేశానికి భవిష్యత్తు అని అన్నారు. మాతృభాషను మరిచిపోవద్దని విద్యార్థులకు సూచించారు. సోమవారం గుంటూరులో భాష్యం విద్యాసంస్థలు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జేఈఈ అడ్వాన్సుడ్ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన సన్మానించారు. చదువు అనేది ర్యాంకుల కోసం కాదని, విజ్ఞానం, వివేకం పెంచుకోవడానికని వెంకయ్య అన్నారు. ఇష్టపడి, కష్టపడి చదవాలని సూచించారు. ప్రాథమిక విద్య మాతృభాషలో జరగాలని, కొత్త విద్యా విధానంలో ఈ అంశానికి ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు బానిసలు కావద్దని వెంకయ్య సూచించారు. సాంకేతికత అవసరమే కానీ.. పూర్తిగా దాని మీదే ఆధారపడవద్దని చెప్పారు. చిన్న సమాచారం కోసం కూడా ఇంటర్నెట్‌పై ఆధారపడుతున్నారని అన్నారు.

## కామారెడ్డి, గజ్వేల్ నుండి
# కేసీఆర్ పోటీ

**- మజ్లిస్‌తో దోస్తీపై సీఎం క్లారిటీ**



తెలంగాణ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 115 నియోజకవర్గాలకు పార్టీ అభ్యర్థులను ప్రకటించారు. సోమవారం ఆయన బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... కేవలం నాలుగు నియోజకవర్గాలను మాత్రమే పెండింగ్‌లో పెట్టినట్లు చెప్పారు. వివిధ కారణాల వల్ల ఏడు స్థానాల్లో మాత్రమే సిట్టింగ్‌లను మార్చినట్లు చెప్పారు. ఇక కేసీఆర్ కామారెడ్డి, గజ్వేల్ నుండి పోటీ చేయనున్నారు.

2023 ఎన్నికలకు ఆరేడుగురు సిట్టింగ్‌లను మాత్రమే తప్పించామని, అందులోను బాగా పని చేసే అభ్యర్థులు కూడా ఉన్నారని చెప్పారు. ఉదాహరణకు వేములవాడ అభ్యర్థి చెన్నమనేని రమేశ్ పౌరసత్వం నేపథ్యంలో ఆయనకు టిక్కెట్ ఇవ్వడం లేదన్నారు. మొత్తానికి పెద్దగా మార్పులు, చేర్పులు లేవన్నారు. బోథ్, అసిఫాబాద్, హైదరాబాద్‌లోని ఉప్పల్, కోరుట్లలో మాత్రమే మార్పులు చేసినట్లు చెప్పారు. ఎన్నికలు అంటే ఇతర పార్టీలకు రాజకీయమని విమర్శించారు. గుజరాత్, మహారాష్ట్రలను తలదన్నేలా తెలంగాణ అభివృద్ధి చెందిందన్నారు. 24 గంటల విద్యుత్ ఇస్తున్నది దేశంలో ఒక్క తెలంగాణ మాత్రమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేస్తుందో కర్ణాటకలో తెలిసిపోయిందన్నారు.తెలంగాణలో మజ్లిస్ పార్టీ, బీఆర్ఎస్ కలిసి ముందుకు సాగుతున్నాయన్నారు. మజ్లిస్, తాము కలిసి ఉమ్మడి హైదరాబాద్‌లో 29 సీట్లకు ఇరవై తొమ్మిది తామే గెలుస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రకటించిన అభ్యర్థులను మనస్ఫూర్తిగా స్వీకరించి, అందర్నీ గెలిపించాలని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో 95 నుండి 105 సీట్లలో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జనగామ, నాంపల్లి, గోషామహల్, నర్సాపూర్ నియోజకవర్గాలను పెండింగ్‌లో ఉంచినట్లు చెప్పారు

# రామోజీరావుపై వైసీపీ చేసిన దాడులను ఖండిస్తున్నా

**-చంద్రబాబు**



మీడియా వ్యవస్థను నాశనం చేసేందుకు యత్నిస్తున్నారంటూ ఏపీ ముఖ్యమంత్రి జగన్ పై టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. సంస్థలను నిర్వీర్యం చేసే ధోరణిని కొనసాగిస్తూ ఇప్పుడు ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభమైన మీడియాను కూల్చివేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. నియంతలా వ్యవహరిస్తూ తనను స్తుతించే మీడియాకు ప్రాధాన్యతనిస్తూ, వైసీపీ మోసాలను, నీచమైన పనులను బయటపెట్టే ఈనాడులాంటి మీడియాను వేధించి, బెదిరిస్తున్నాడని దుయ్యబట్టారు. తన సొంత వైఫల్యాలు, ప్రజలలో నెలకొన్న తీవ్ర వ్యతిరేకతతో జగన్ నిరాశలో కూరుకుపోయాడని చెప్పారు. 60 ఏళ్లుగా తెలుగు ప్రజలకు సేవ చేసిన మార్గదర్శి వంటి దీర్ఘకాల సంస్థలను జగన్ లక్ష్యంగా చేసుకున్నాడని, ఆ సంస్థ ఖ్యాతిని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. జర్నలిజం, సాహిత్యం, విద్యా రంగాల్లో చేసిన సేవలకు గాను రామోజీరావును దేశంలోనే రెండో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మవిభూషణ్ తో భారత ప్రభుత్వం సత్కరించిందని... ఎంతో ఉన్నత విలువలు కలిగిన రామోజీరావుపై వైసీపీ చేసిన దాడులను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని చంద్రబాబు అన్నారు. జగన్ ఎన్ని దుష్ట ప్రయత్నాలు చేసినా ఫలితం ఉండదని... ఎందుకంటే చెడు ఎప్పుడూ ఓడిపోతుందని, మంచి ఎప్పుడూ గెలుపొందుతుంటుందని చెప్పారు

# జగనన్నకు చెబుదాం - స్పందన విజ్ఞప్తులపై సత్వర చర్యలు గైకొనండి.

## -సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్.

ఆంధ్రప్రగతినంద్యాల, ఆగస్టు 21:
ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమంలో స్వీకరించిన విజ్ఞప్తులపై సత్వర చర్యలు గైకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, ఇతర జిల్లాధికారులు జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.




ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను నిర్ణీత కాల పరిమితిలోగా ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగులో వున్న 132 రీఓపెన్ సర్వీసులకు సంబంధించి దరఖాస్తులన్నింటినీ వెంటనే క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్ ఎల్ ఏలోకి వెళ్లకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. మొక్కుబడి రీతిలో క్లోజ్ చేయకుండా అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో ఖచ్చితమైన పరిష్కారం చూపాలన్నారు. పెండింగ్ లో ఉన్న జగనన్నకు చెపుదాం ఈకేవైసీని రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.
గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన 1372 పనుల్లో 705 పనులు పురోగతిలో వున్నాయని మిగిలిన పనులు వెంటనే గ్రౌండ్ లోకి తీసుకరావాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే త్వరితగతిన పూర్తి చేసి బడి బయట ఉన్న విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలన్నారు.
ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొన్ని వినతులు
1)బనగానపల్లె మండల నివాసి మాజీ సైనికుడు ఎస్ ఎం బాషా తనకు మాజీ సైనికుల కోటా కింద 2012 సంవత్సరంలో సర్వే నెం. 174, 175 లలో 9.8 సెంట్లు ఇచ్చారని... సదరు భూమిలో సాగు చేసుకుంటున్నానని జి.ఓ 297 ప్రకారం అసైన్మెంట్ నిషేధిత జాబితా నుండి తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.
2) దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామ నివాసి బికారి సాహెబ్ తనకున్న 1.95 సెంట్ల స్థలాన్ని ఆన్లైన్లో ఎక్కించాలని కోరుతూ కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.
3) మహానంది మండలం గాజులపల్లి గ్రామ నివాసితురాలు జయమ్మ తనకు సర్వే నంబర్ 34 లో 16 సెంట్ల భూమి వుందని.... సదరు స్థలంలో కరెంట్ తీగలు వెళ్లి వున్నాయి... తొలగించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు అధిక మొత్తంలో ఛార్జ్ చేస్తున్నారని, అధిక మొత్తం తాను చెల్లించుకోలేనని కరెంటు తీగల తొలగింపుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరుతూ దరఖాస్తు సమర్పించుకున్నారు.
ఇంకా ఈ కార్యక్రమంలో 215 మంది అర్జీదారులు తమ సమస్యలపై వినతి పత్రాలుజిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కు సమర్పించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ వారు ఆదేశాలు జారీ చేశారు

# రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల సాధనకై జరుగు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 21:
రాష్ట్రాన్ని కాపాడండి దేశాన్ని రక్షించండి. నినాదంతో సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న బస్సు యాత్రలో భాగంగా సెప్టెంబర్ 1వ తేదీన రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల సాధన కై రాష్ట్ర సదస్సు నంద్యాల పట్టణంలో జరుగుతుందని జిల్లాలోని రైతులు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు పిలుపునిచ్చారు.
పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర జాతా వాల్ పోస్టర్లను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు గారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిఎస్.బాబా ఫక్రుద్దీన్. సిపిఐ పట్టణ కార్యదర్శి కె .ప్రసాద్.ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి నాగరాముడు. సిపిఐ సీనియర్ నాయకులు సంజీవులు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి జి. సోమన్న. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు. ఏఐటీయూసీ కార్యదర్శి .డి శ్రీనివాసులు.సిపిఐ జిల్లా సమితి సభ్యుడు హరినాథ్.ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్. సిపిఐ నాయకులు సామన్న. మా భాష.తదితరులు పాల్గొన్నారు.




ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు. కే రామాంజనేయులు గారు మాట్లాడుతూ.
దేశంలో నరహంతక నరేంద్ర మోడీ పాలన లో దేశ ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని ఓట్ల కోసం తమ సీట్ల కోసం అన్యోన్యంగా ప్రజల మధ్య మత కలహాలు సృష్టిస్తూ ఎవరైనా ఎదిరిస్తే వారిపై ఈడీ దాడులు. బుల్డోజర్లతో వారి ఇళ్లను కూల్చివేస్తూ విచారణ లేకుండా జైలులను ప్రజలను నిర్బంధిస్తూ మహిళలపై హత్యాచారాలు జరుగుతున్న ఏమాత్రం పట్టించుకోకుండా చూద్దాం చూస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని అన్నారు.
రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వము కేంద్ర ప్రభుత్వానికి దాసోహం అంటూ రాష్ట్రానికి రావలసినదిను రాబట్టుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెంది వచ్చిన నిధులను నవరత్నాల పేరుతో వాటిని మళ్లించడం దారుణమని రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు నిధులు లేకపోగా వాటికి నిధులు కేటాయించకపోవడం వల్ల ప్రాజెక్టులు పూర్తిగా గాక అరకొర పనులు జరుగుతున్నాడం వల్ల సంవత్సరాల తరబడి ప్రాజెక్టు పనులు జరుగుతున్నాడం విచారకరమని తండ్రి వారసత్వాన్ని పునికి పుచ్చుకుంటాడు అని ప్రజలు ఓటు వేస్తే వారి ఆశలను అడి యాసలు చేశాడని విమర్శించారు.
దేశంలో రాష్ట్రంలో జరుగుతున్న రాష్ట్ర పాలనపై సిపిఐ రాష్ట్ర సమితి ప్రజల వివరించేందుకు బస్సు యాత్రతో బయలుదేరి 26 జిల్లాల పర్యటించి ప్రజలను ఐక్యం చేసి రాబోయే ఎన్నికలలో రాష్ట్రాన్ని రక్షించి దేశాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.



## ప్రజా సంక్షేమం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం.

### - ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ ఆగస్టు 21:.
నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 38వ వార్డు వైఎస్ఆర్ నగర్ లో వార్డు ఇన్చార్జి టీవీ రమణ కౌన్సిలర్ సావిత్రమ్మ ఆధ్వర్యంలో 137వరోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు ముందుగా వార్డు వైసిపి నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు అందించారు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా సచివాలయ మరియు వాలంటరీ వ్యవస్థ ఏర్పాటు చేసి మా ఇంటి దగ్గరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.
ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో దృఢ సంకల్పంతో రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజాధరణ పొందుతున్నదని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఏఏ స్థాయిలో , ఏఏ వర్గాలకు, చెందుతున్నాయో, ఏమాత్రం చెందుతున్న అన్న అంశంపై ఎమ్మెల్యే ఆరా తీసి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ సంక్షేమ పథకాలైన నవరత్నాలు తదితర అంశాలు ప్రజాదరణ పొందుతూ ప్రజల్లో జగన్ మోహన్ రెడ్డి పై నమ్మకం కుదిరించుకుంటూ అభివృద్ధి దృష్టిలో పయనిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి కోసం నాడు నేడు కార్యక్రమం అనేక రకాలైన హామీలను నెరవేరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మబ్బున్నిసా, ఆప్కో డైరెక్టర్ సుబ్బారాయుడు మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్ షావలి వైసిపి నాయకులు అంకాలయ్య, బాబురావు, నరసింహరావు శెట్టి ,తిరుపతయ్య, జాకీర్ హుస్సేన్, అన్వర్ భాష, రామకృష్ణారెడ్డి, ప్రసాద్ రెడ్డి, పుల్లమ్మ, వెంకటస్వామి శెట్టి, ఆచారి, రాము, ఉమాకాంతయ్య ,బాబు ,చిరు, సోమశేఖర్ ,శివ ,గోరే ,ముర్తుజాచెన్నప్ప ,మరియు వార్డు సచివాలయ సిబ్బంది మరియు వాలంటరీలు వార్డు ప్రజలు పాల్గొన్నారు

# జాతీయ రహదారి నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి.

**- రైతులకు ఏకరాకు 50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి.**

**- రైతుల కడుపు కొడుతున్న ఎన్.హెచ్ కాంట్రాక్టర్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలి.**

ఆంధ్ర ప్రగతి బేతంచెర్ల ఆగస్టు 21:.
సోమయాజుల పల్లె నుండి డోన్ వరకు నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి 340బి లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే పనులు ప్రారంభించాలని సిపిఐ మండల కార్యదర్శి భార్గవ్ యన్న అధ్యక్షతన స్థానిక తహసిల్దార్ ఆఫీస్ నందు ధర్నా నిర్వహించారు ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు హాజరై అనంతరం మాట్లాడుతూ...
జాతీయ రహదారి నిర్మాణంలో రైతులకు ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం చెల్లించకుండానే ఎన్.హెచ్ కాంట్రాక్టర్ అధికార మదంతో పనులు ప్రారంభించడం దారుణమని తక్షణమే రైతులకు నష్టపరిహారం చెల్లించిన తరువాతనే పనులు ప్రారంభించే విధంగా అధికారులు కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని బేతంచెర్ల మండలంలో సుమారు దాదాపుగా 311 మంది రైతులు తమ భూమిని కోల్పోయి ఎలాంటి జీవనోపాధి లేక మరోవైపు పంటను వేసుకోలేక రోడ్డున పడే పరిస్థితి నెలకొనిందని ఆగ్రహం వ్యక్తం చేశారు పరిహారం అడిగిన రైతులను భయబ్రాంతులకు గురిచేసి నేను ఎంత ఇస్తే అంత మాత్రమే మీరు తీసుకోవాలి ఒప్పందాలు చాలా ఉంటాయి అవి అన్ని మీరు ప్రశ్నించకూడదు అని హుకుం జారీ చేస్తున్నారని ఆరోపించారు నా పనులకు ఎవరైనా అడ్డు తగిలితే ఎవరిని వదిలిపెట్టి లేదని నా వెనుక ప్రభుత్వం, అధికారులు ఉన్నారని దీనిని మీరు బయటకు చెబితే ఎవ్వరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వను అని అవసరమైతే పోలీసుల ద్వారా మీపై కేసులు పెడతానని బెదిరింపులకు దిగడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు రైతుల కడుపు కొట్టాలని ప్రయత్నిస్తే హైవే పనులను జరగకుండా దిబ్బందిస్తామని హెచ్చరించారు ఇప్పటికైనా కాంట్రాక్టర్ తలపొగరు దించుకొని భూమి కోల్పోయిన రైతులకు ఎకరాకు 50 లక్షల రూపాయలను నష్టపరిహారంగా చెల్లించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి నేషనల్ హైవే పనులను నిలుపుదల చేసి రైతులకు చెల్లించిన తర్వాతనే పనులు ప్రారంభించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తాశీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డికి సిపిఐ నాయకులు అందజేశారు ఈ విషయంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు తాలూకా తిరుమలేష్ దస్తగిరి ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ సిపిఐ నాయకులు సోమన్న బాలస్వామి శ్రీరాములు ఆదినారాయణ నాగేశ్వరరావు నాగేష్ ఏఐవైఎఫ్ నాయకులు భరణి ప్రదీప్ భాస్కర్ ప్రసాద్ కార్తీక్ ప్రదీప్ రవి మనోజ్ నితీష్ తదితరులు పాల్గొన్నారు.




## సిద్దిపేట కలెక్టర్ ఆఫీస్ లో ఓటు హక్కు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వికలాంగులు

న్యూస్ /. సిద్దిపేట)బీసిద్దిపేట జిల్లా కలెక్టర్ ఆఫీస్ లో ఓటు హక్కు అవగాహన కార్యక్రమములో పాల్గొన్న తెలంగాణ వికలాంగుల వేదిక సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆరుకొండ మల్లేశం తనతో పాటు కొందరు దివ్యాంగులు పాల్గొని ఓటు హక్కు ఎలా వాడల్లో వారికి తెలియజేయడం జరిగింది.కాబట్టి తమ యొక్క ఓటును వృధా చేయకుండా ఓటుతో నిజమైన రాజకీయ నాయకులకి ఓటు వేసి గెలిపించుకోవాలని ఆయన మాట్లాడడం జరిగింది.



# జిల్లాటీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో రైతుల నిరసన దీక్షలు.




ఆంధ్ర ప్రగతి ఓర్వకల్లు ఆగస్టు 21:
కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం తాసిల్దార్ కార్యాలయం వద్ద నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతుల కోసం నిరసన దీక్ష కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత్ర రెడ్డి , పోలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రివర్యులు శాసనమండలి సభ్యులు ఎన్ఎండి ఫరూక్, బనగానపల్లె నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి , శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి గారు, ప్రముఖ న్యాయవాది తెలుగుదేశం పార్టీ నాయకుడు తాతిరెడ్డి తులసి రెడ్డి, కాపు సామాజిక వర్గం నాయకుడు చింతల సుబ్బరాయుడు పాణ్యం మండలం తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ అడ్వైజర్ లాయర్ బాబు, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు జయరామిరెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ ఎస్కే చాంద్బాషా, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.
ఈ సందర్భంగా పాణ్యం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత రెడ్డి మాట్లాడుతూ ఇది రైతు ప్రభుత్వం వ్యవసాయం పండుగ చేస్తామని వాగ్దానం చేసిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తూ ఆత్మహత్యలకు పురిగోల్పుతూ రైతుల యొక్క కన్నీటిని చూస్తూ పాలన చేస్తున్న జగన్మోహన్ రెడ్డికి రైతులు గురించి ఏం తెలుసు అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతులు అనేక ఇబ్బందులకు గురై ఆత్మహత్యలు చేసుకుంటుంటే వారి గోడును పట్టించుకున్నటువంటి పరిస్థితి ఈ జగన్మోహన్ రెడ్డికి లేదన్న విషయాన్ని తెలుసుకోవాలని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏం జరుగుతుందో ఈ చీకటి పాలన గురించి ప్రజలు ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. అదేవిధంగా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఐదు సంవత్సరాలలో ప్రాజెక్టుల కోసం 68 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. మరి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కేవలం ఈ నాలుగున్నర సంవత్సరాలలో 22 వేల కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేశారంటే మరి ఈయన యొక్క అభివృద్ధి ఎలా ఉందో ఒకసారి ప్రజలు ఆలోచించాలన్నారు. వ్యవసాయం మీద వీరికి ఏమాత్రం ప్రేమ లేదు. అదే విధంగా ఇప్పుడు ఉన్నటువంటి నాయకులు కబ్జాలు చేస్తూ ప్రజలను ఇబ్బంది పాలు చేస్తున్నటువంటి అనేక విషయాలు మనం ప్రతిరోజు పత్రికలలో చూస్తున్నాం, అదేవిధంగా ఓర్వకల్లులో కోట్ల విలువ చేసే భూములను స్థానిక నాయకుడు కబ్జాలు చేసుకుంటూ పోతున్నటువంటి విషయం కూడా అందరికి తెలిసినదే అన్నారు. తెలుగుదేశం పార్టీ కచ్చితంగా అధికారంలోకి రావడం జరుగుతుంది. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారు రైతులకు, ప్రజలకు అందరికీ కూడా మేలు జరుగుతుందన్నారు. అదేవిధంగా
శాసనమండలి సభ్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రైతులు అధైర్యపడవద్దని, ఆత్మహత్యలు చేసుకోవద్దని ,రైతు సమస్యలు పేపర్లలో వచ్చిన కూడా పరిష్కారం చూపే పరిస్థితుల్లో ముఖ్యమంత్రి ఈ జగన్మోహన్ రెడ్డి లేడన్నారు.ఆయన ఊహల్లో పాలన కొనసాగిస్తున్నాడు. రైతులు పంట కాలువలకు నీళ్లు ఎప్పుడొస్తావని ఎదురు చూస్తున్నప్పటికీ కూడా ఆయనకు చీమకుట్టినట్టు కూడా లేదని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల కష్టాల మీద నిరసనల ద్వారా సమస్యలను గురించి మాట్లాడుకోవడానికి మరియు చెప్పుకోడానికి కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని ఆంక్షలు విధించడం ఎంత దుర్మార్గపూరితమైనదో ఒకసారి ప్రజల ఆలోచించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతులను ప్రజలను ఇబ్బంది పాలు చేస్తూ వారి కన్నీటిని చూస్తూ మోసపూరితమైనటువంటి నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్రాన్ని దోచుకుంటూ పాలన కొనసాగిస్తూ పబ్బం గడుపుకుంటున్నాడని అన్నారు. త్వరలో వైసిపి పాలనకు చరమగీతం పాడే రోజు దగ్గరలో ఉందని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసి రెడ్డి మాట్లాడుతూ వైయస్ జగన్ అధికారం చేపట్టిన తర్వాత అతిపెద్ద వివాదం అమరావతి రాజధాని విషయం అని అన్నారు. రాజధాని కోసం రాజధాని ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్నటువంటి భూముల్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అభివృద్ధి కోసం ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ జాతీయ నాయకుడు నారా చంద్రబాబు నాయుడు మీద అభిమానంతో ఈ ప్రాంతం అభివృద్ధి అవుతుందని అమరావతి రాజధాని అయితే అన్ని ప్రాంతాల వారు అభివృద్ధి చెందుతారని మంచి సదుద్దేశంతో వేల ఎకరాలు భూములు ఇవ్వడం జరిగింది అన్నారు. అయితే ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానుల పేరుతో జీవోల మీద జీవోలు ఇస్తూ రైతులకు కంటి మీద నిద్ర లేకుండా రైతులపై కేసులు పెట్టించి రైతులను లాఠీలతో ,బూటు కాళ్లతో తన్నించుకుంటూ, రైతు కూలీలను, రైతులను వేరేచోట్లకు తీసుకెళ్లి ఇబ్బంది పెట్టారు అమరావతి రైతులను జైల్లో పెట్టించడం అరెస్టు చేయడం వారి కన్నీటిని చూశారు. పోలీసులు కూడా వారిని ఎన్నో ఇబ్బందులకు గురి చేయడం జరిగింది.రైతులను మోసం చేశారు.చంద్రబాబు నాయుడు గారి పరిపాలనలోనే రైతు సమస్యలకు పరిష్కారం జరిగేది అన్నారు. అమరావతి రైతుల త్యాగం వృధా కాదన్నారు రాష్ట్రం కోసం ఎంతో విలువైన భూములు త్యాగం చేశారు. అలాంటి రైతులను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. కాబట్టి రైతులు ధైర్యంగా ఉండాలని ఎవరు కూడా ఆత్మహత్యలకు పాల్పడవద్దని కోరారు.అదేవిధంగా హైకోర్టు నుండి అమరావతి వైపు దుర్గాప్రసాద్ జడ్జిగారు రోడ్డు వెంట నడుచుకుంటూ వెళు తుండగా ఒక రైతు మాసిన గుడ్డలతో చినిగిపోయిన చొక్కాతో డివైడర్లు ప్రక్కన కూర్చుని ఉండగా ఆయన సెల్ఫోన్లో చాగంటి ప్రవచనాలు వింటూ వాకింగ్కు పోతున్న సందర్భంలో ఆ రైతు నమస్కారం పెట్టాడు మాట కలిపి సార్ చాగంటి ప్రవచనాలు ఉన్నట్లు ఉన్నావని అడగగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆ రైతును జడ్జిగారు అడగడం జరిగింది. ఆ రైతు స్పందిస్తూ రాజధాని కోసం నేను నాలుగు ఎకరాలు భూమి ఇచ్చాను అని చెప్పగా నీకు ఏమైనా నష్టపరిహారం డబ్బులు వచ్చావని ప్రతిస్పందనతో అడుగగా నాకు ఏమీ అవసరం లేదు రాజధాని కోసం నాకున్న నాలుగు ఎకరాలు భూమి ఇచ్చాను అభివృద్ధి జరగాలని ఆకాంక్షిస్తున్నానని చెప్పడం జరిగిందని నంద్యాల ప్రముఖ న్యాయవాది తెలుగుదేశం పార్టీ నాయకుడు తులసి రెడ్డి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం తెలిపారు, రైతుల దీక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ఒక్కరు వస్తారా.. వందమంది వస్తారో తేల్చుకుందామని ఛాలెంజ్ విసిరిన ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 21:.
ప్రజా క్షేత్రంలో తేల్చుకుందాం... ఒక్కరు వస్తారా.. వందమంది వస్తారో తేల్చుకుందామని ప్రతి పక్షాలకు ఎమ్మెల్యే శిల్పార రెడ్డి ఛాలెంజ్ విసిరారు. తాజాగా రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్సీపీ జెండా ఎగురవేసిందని, ప్రజల్లో తమ సత్తా మరోసారి నిరూపించామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నంద్యాల జిల్లా పరిదిలో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్సీపీ సాధించిన విజయాలపై వివరాలు వెల్లడించారు.
ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్రెడ్డి పారదర్శక, ప్రజా సంక్షేమ పాలనపట్ల ప్రజలు తాజాగా రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల్లో ఓటు ద్వారా వైఎస్సార్ పార్టీపై విశ్వాసం, నమ్మకాన్ని తెలియజేశారన్నారు. టీడీపీ, జనసేన, వారి మద్దతుదారులు వైఎస్సార్ పార్టీ పని అయిపోయిందని చేస్తున్న దుష్ప్రచారానికి నేటి ఉప ఎన్నికల ఫలితాలే చక్కటి ధీటైన జవాబు అన్నారు. ప్రజాక్షేత్రంలో గెలిచింది, రానున్న ఎన్నికల్లో గెలిచేది జగనన్ననే అని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజా తీర్పు వైఎస్సార్ పార్టీకే వస్తుందని ఈ ఉప ఎన్నికలు నిరూపించాయన్నారు. 66 సర్పంచ్ ఎన్నికల్లో 30 స్థానాల్లో వైఎస్సార్సీపీ ఏకగ్రీవం కాగా, 36 స్థానాల్లో పోటీ చేయగా వాటిలో 23 స్థానాలను వైఎస్సార్సీపీ బలపరచిన అభ్యర్థులు విజయం సాధించారన్నారు. 66 స్థానాల్లో 53 స్థానాలు వైఎస్సార్సీపీ కైవసం చేసుకుందన్నారు. రాష్ట్రంలో 1062 వార్డులలో 756 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని 243 స్థానాల్లో పోటీ చేస్తే అందులో 150 స్థానాలు వైఎస్సార్సీపీ గెలిచిందన్నారు. లోకేష్ పాదయాత్ర, పవన్ కళ్యాణ్ పాదయాత్రలు వైసీపీ గెలుపును నిలువరించలేవని నిరూపితమయ్యాయన్నారు. ప్రతి పక్షనాయకులు ఉన్న కీలక ప్రాంతాలైన కుప్పంలో 6స్థానాల్లో5 స్థానాలు వైసీపీ కైవసం చేసుకుందన్నారు. జేసీ అడ్డాలో వైసీపీ జెండా ఎగురవేశామన్నారు. ప్రజాక్షేత్రంలో ఓటరు ఎవ్వరికీ భయపడరని, ఓటు అనే వజ్రాయుధాన్ని తమకు నచ్చిన వారికి వేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభంజనం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లాలో 19 స్థానాల్లో ఎన్నికలు జరిగితే 16 వైఎస్సార్సీపీ విజయం సాధించిందన్నారు. కేవలం 3స్థానాలకే టీడీపీ గెలిచిందన్నారు. సీఎం జగనన్న వైపే ప్రజలు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్రెడ్డి, వైస్ చైర్మన్ పాషావలి, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, వైఎస్సార్సీపీ నాయకుడు నందంబాబురావు, తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం జిల్లా ఉరవకొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారిని సస్పెండ్ చేసిన ప్రభుత్వం.



ఆంధ్ర ప్రగతి ఉరవకొండ ఆగస్టు 21:.
జిల్లా పరిషత్ సిఈఓగా ఉన్న భాస్కర్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఆదేశాలుకేంద్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఈ రోజు సస్పెన్షన్ ఉత్తర్వులను వెలువరిస్తూ జీఓ జారీ అనంతపురంలో ఆరు వేల దొంగ ఓట్లను చేర్పించడంతో పాటు, ఉన్న వారి ఓట్లను కూడా తొలగించిన అంశం పై కేంద్ర ఎన్నికల కమీషన్ కు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్కేశవ్ ఫిర్యాదు మేరకు అనంతపురం జిల్లా ఉరవకొండ వచ్చి పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాస్కర్ రెడ్డి పాత్ర ఉందని తేల్చిన కమీషన్దీంతో, అతనిని సస్పెండ్ చేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చిన కేంద్ర ఎన్నికల కమీషన్ చాలా రోజులు పెండింగ్ లో ఉంచడంతో మళ్లీ ఆదేశాలు ఇచ్చిన ఎన్నికల కమీషన్ దీంతో, జడ్పిసీఈఓ గా ఉన్న భాస్కర్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం.

## జర్నలిస్టులపై నమోదైన అక్రమ కేసుల ఎత్తివేతపై ఎపియుడబ్లుజె రౌండ్ టేబుల్ సమావేశం.

**- పాల్గొన్న అఖిలపక్ష పార్టీల నాయకులు**



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 21:.
నంద్యాల జిల్లా మహానంది జర్నలిస్టులపై నమోదైన అక్రమ కేసుల ఎత్తివేతపై సోమవారం ఎపియుడబ్లుజె ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు మధుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్యాంసుందర్ లాల్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చలంబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతల మోహన్ రావు, చింతలయ్య, బిజెపి జిల్లా నాయకులు బుడ్డా శ్రీకాంత్ రెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, సిపిఎం నాయకులు నర్సింహులు, జనసేన నాయకులు సురేష్, ఎస్డిపిఐ నాయకులు కరిముల్లా, ఇర్ఫాన్, ఏపీయుడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి ఉస్మాన్ భాష, జిల్లా కమిటీ సభ్యులు చల్లా మధు, బాలు నాయక్, రాజేష్ కుమార్, నాగమణి, రాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు జరగడం దారుణమని, తిరిగి వారిపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం భావ్యం కాదన్నారు. ఏపీయుడబ్ల్యూజే చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు తమ వంతు మద్దతు ఉంటుందని వారు పేర్కొన్నారు.

## నీటి సంరక్షణ అంశంపై సదస్సు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 21:
పట్టణంలోని శ్రీ రామక్రిష్ణ డిగ్రీ కళాశాలలో సోమవారము "నీటి సంరక్షణ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల అధ్యక్షులు డా? రామక్రిష్ణ రెడ్డి గారు అధ్యక్షత వహించగా, సదస్సులో వక్తగా, యూనివర్సిటి విశ్రాంత ఫిజిక్స్ ప్రొఫెసర్ రామక్రిష్ణ రెడ్డి . గారు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు డాఎం రామకృష్ణరెడ్డి గారు. మాట్లాడుతూ మానవాళి మనుగడ, అభివృద్ధి, నాగరికత అనునవి నీటిపై ఏ విధంగా ఆధారపడ్డాయో, భావితరాలకు నీటి సంరక్షణ ఎంతో ప్రాముఖ్యం అని వివరిస్తూ ఆధునిక యుగంలో తరుము కస్తున్న నీటి సంక్షోభానికి మనిషి ఆలోచనలే. కారణం అని చెబుతూ ఆధునిక మనిషి తన సౌకర్యాల కోసం పర్యావరణానికి తీరని హాని చేస్తున్నాడని తెలియజేశారు.
అనంతరం వక్త రామక్రిష్ణ రెడ్డి మాట్లాడుతూ ఈ విశ్వంలో సమస్త జీవకోటికి నీరే ప్రాణాధారం, నీరు ఎక్కడ ఉంటే అక్కడ అభివృద్ధి జరుగుతుందని, భూమిపై ఉన్న నీటి వనరుల్లో ఎక్కువ శాతం సముద్రాల్లోనే ఉన్నది, మనకు పనికి వచ్చే నీరు కేవలం 3%. అని, ఈ జలవనరులను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉన్నది అని ఈ సందర్భంగా తెలియచేశారు. సైన్సు పరంగా ఎంతో అభివృద్ధి చెందిన మంచి నీరు లేక జాంబియ, ఇతియోపియ, కెన్యా దేశాలలో ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారు వివరించారు. జల సంక్షోభం దిశగా భారతదేశం పరుగులు తీస్తోందనీ, నీరు వాడే తీరు మార్చుకోకపోతే రానున్న 20 సంవత్సరాలలో గుక్కెడు నీళ్ళు దొరకని పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.
సదస్సు అనంతరం రామక్రిష్ణడ్డిని, కళాశాల చైర్మన్, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.
ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగపు అధిపతి డా? వేంకటేశ్వర్లు, అధ్యాపకులు నాగరాజు, చెన్న కేశవ రావు, సల్మా తదితరులు పాల్గొన్నారు




## మహానందీశ్వరుని సన్నిధిలో జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు .

ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 21:
మహానంది సన్నిధిలో కర్నూలు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీనివాసరావు దంపతులు మరియు, డి ఎల్ ఎస్ సెక్రటరీ శ్రీనివాసరావు దంపతులు లు సోమవారం సాయంత్రం పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం అమ్మవారికి కుమార్చన తదితర పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందు ఆలయ ఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి వీరికి ఘనంగా స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం వారిని దుశ్శాలువా తో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు పూజా కార్యక్రమాల అనంతరం వారు స్వామి అమ్మవార్ల పల్లకి సేవలో పాల్గొన్నారు.



# చరిత్ర ఉన్న ఆటోనగర్ జగన్ పాలనలో సంక్షోభంలో కూరుకుపోయింది.

ఆంధ్ర ప్రగతి విజయవాడ ఆగస్టు 21:
విజయవాడ ఏ కన్వెన్షన్ విడిది కేంద్రం వద్ద ఆటో నగర్, రవాణా రంగం ప్రతినిధులు, కార్మికులతో ముఖాముఖీ సమావేశంలో పాల్గొన్న నారా లోకేష్.

దేశంలో మొదటి ఆటో నగర్ విజయవాడ లో ఏర్పాటు చేశారు. ఆసియా లోనే ఇది అతి పెద్ద ఆటో నగర్. ఎన్టీఆర్ గారి చైతన్య రథం కూడా ఇక్కడే తయారైంది. అంత చరిత్ర ఉన్న ఆటో నగర్ ఇప్పుడు జగన్ పాలనలో సంక్షోభంలో కూరుకుపోయింది.

ట్రాన్స్ పోర్ట్ రంగం జగన్ పాలన లో కుదేలు అయ్యింది.గ్రీన్ ట్యాక్స్ పేరుతో వేధిస్తున్నారు. రూ.200 ఉన్న గ్రీన్ ట్యాక్స్ ని రూ.26,816 చేశారు. ఓవర్ లోడ్, ఓవర్ హైట్ పేరుతో జగన్ ప్రభుత్వం మమ్మల్ని దోచుకుంటుంది. కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ పేరుతో ఏడాదికి రూ.60 అదనపు భారం పడుతుంది.

జగన్ పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచేయడం వలన ట్రాన్స్ పోర్ట్ రంగం పై ఆధారపడిన వారు రోడ్డున పడ్డాం. రోడ్లు కూడా దారుణంగా ఉండటం వలన ట్రాన్స్ పోర్ట్ యాజమానుల పై విపరీతమైన భారం పడుతుంది.

ట్రాన్స్ పోర్ట్ రంగాన్ని ఆదుకోవడానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయండి.

ఆటో నగర్ లో పనిచేస్తున్న కార్మికుల కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు ఏర్పాటు చేయండి.

పంచర్ షాపులు పై ఆధారపడిన వారు జీఎస్టీ వలన ఇబ్బంది పడుతున్నారు. టైర్లు కొనాలి అన్నా, పాత టైర్ అమ్మాలి అన్నా జీఎస్టీ పేరుతో వేధిస్తున్నారు.

57 ఏళ్లుగా ఆటో నగర్ లో లక్షలాది మంది ఉపాధి పొందుతున్నారు. అయినా అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం. తాగునీరు, డ్రైనేజ్, రోడ్లు లేక ఇబ్బంది పడుతున్నాం.

ఆటో నగర్ లో యాజమాన్య హక్కులు లేక ఇబ్బంది పడుతున్నాం.

జగన్ ఇప్పుడు ఆటో నగర్ ని తరలిస్తామని బెదిరిస్తున్నాడు.

జగన్ ఆటో నగర్ ని నాశనం చేస్తూ ఇచ్చిన జీఓ లను రద్దు చెయ్యాలి.



టెక్నాలజీ మారుతుంది బి ఎస్ 6 వాహనాలు వస్తున్నాయి. మాకు నైపుణ్య శిక్షణ ఇప్పించాలి. మెకానిక్స్ కి శిక్షణ ఇస్తే మంచి ఫలితాలు వస్తాయి.

ట్రాన్స్ పోర్ట్ రంగం పై ప్రభుత్వానికి ఎంతో ఆదాయం వస్తున్నా. ఆటో నగర్, ట్రాన్స్ పోర్ట్ రంగం పై ఆధారపడిన వారికి ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం లేదు. ఇన్స్యూరెన్స్ , ఆరోగ్య భద్రత కల్పించాలి.

టూ వీలర్ మెకానిక్స్ ని కూడా ప్రభుత్వం ఆదుకోవాలి.

...ఆటో నగర్, రవాణా రంగం ప్రతినిధులు, కార్మికులు లోకేష్ మాట్లాడుతూ

ఆటోనగర్ కి గొప్ప చరిత్ర ఉంది. మేము అంబాసిడర్ కొన్నప్పుడు ఆటో నగర్ లోనే అప్ గ్రేడ్ చేయించాం. అంబాసిడర్ కారు ని ఆటోమేటిక్ కారు గా మార్చిన నైపుణ్యం ఆటోనగర్ కార్మికులది.

ఆటోనగర్ లో ఎంతో మంది నైపుణ్యం ఉన్న కార్మికులు ఉన్నారు.

జగన్ ది దరిద్ర పాదం. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాలు దెబ్బతిన్నాయి. అందరూ నష్టపోయారు.

కరోనా కంటే జగనోరా వైరస్ ప్రమాదకరం.

కరోనా కి వ్యాక్సిన్ వచ్చింది. జగనోరా వైరస్ కి వ్యాక్సిన్ త్వరలోనే వస్తుంది.ఆటో నగర్ లని ప్రైవేట్ పరం చేసి భూములు కొట్టేయాలని జగన్, వైసిపి నాయకులు ఏకంగా జిఓ తీసుకొచ్చారు.

కరోనా సమయంలో పనులు లేక ఆటో నగర్ లో కార్మికులు,



యజమానులు ఇబ్బంది పడ్డారు.

జగనోరా వలన పూర్తిగా ఆటోనగర్ లే మాయం అయ్యే పరిస్థితి వచ్చింది.

జగన్ పాలన లో ట్రాన్స్ పోర్ట్ రంగం కుదేలు అయ్యింది.

గ్రీన్ ట్యాక్స్, ఇతర పన్నులు విపరీతంగా పెంచేసి ట్రాన్స్ పోర్ట్ రంగాన్ని జగన్ దెబ్బతీశాడు.

అనేక పేర్లతో పన్నులు పెంచేసి ట్రాన్స్ పోర్ట్ రంగాన్ని జగన్ దెబ్బ తీశాడు. గ్రీన్ ట్యాక్స్, ఓవర్ హైట్, ఓవర్ లోడ్, క్వార్టర్లీ ట్యాక్స్ పేరుతో జగన్ ట్రాన్స్ పోర్ట్ రంగం పై ఆధారపడి ఉన్న వారిని వేధిస్తున్నాడు.

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇతర రాష్ట్రాలతో పోటీ పడే విధంగా పన్నులు తగ్గిస్తాం.

టిడిపి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పన్నులు తగ్గించి ఇతర రాష్ట్రాలతో మన ట్రాన్స్ పోర్ట్ రంగం పోటీ పడే విధంగా చేస్తాం. అన్ని రాష్ట్రాల కంటే కనీసం రూపాయి తక్కువ పన్ను ఉండేలా చేస్తాం.

జగన్ పాలనలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉన్నాయి. దీని వలన కూడా ట్రాన్స్ పోర్ట్ రంగం పై విపరీతమైన భారం పడుతుంది. కనీసం రోడ్ల పై ఉన్న గుంతలు పుడ్చే దిక్కు లేదు.

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త రోడ్లు వేస్తాం.

జగన్ పాలనలో పెట్రోల్, డీజిల్ ధరల్లో ఏపి దేశంలోనే నంబర్1 టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెట్రోల్, డీజిల్ పై పన్ను తగ్గిస్తాం.

జగన్ ఐదేళ్ల పాలనలో 12 లక్షల కోట్లు అప్పు చెయ్యబోతున్నాడు.

కార్పొరేషన్లు బలోపేతం చేసి వాహనాలు కొనుగోలు చెయ్యడానికి సహకారం అందిస్తాం.

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆటో నగర్లు, ట్రాన్స్ పోర్ట్ రంగం పై ఆధారపడిన వారిని, కార్మికులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం.

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ ఛార్జీలు కూడా తగ్గిస్తాం.

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆటో నగర్ ల అభివృద్ధి కి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తాం. అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తాం. విజయవాడ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తాం.

ఆటో నగర్ లను నాశనం చేస్తూ జగన్ తెచ్చిన జిఓ లు టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తాం. సగం భూమి కొట్టేయాలని జగన్ తెచ్చిన జీఓ లు మొత్తం రద్దు చేస్తాం.

టెక్నాలజీ చాలా స్పీడ్ గా మారుతుంది. మెకానిక్స్ కి టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే నైపుణ్య శిక్షణ ఇప్పిస్తాం. అవసరమైన పనిముట్లు కొనుగోలు చేసేందుకు సహకారం అందిస్తాం. నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం.

ఆటో నగర్, ట్రాన్స్ పోర్ట్ రంగం పై ఆధారపడిన కార్మికులు ఇన్స్యూరెన్స్, ఆరోగ్య భద్రత కోసం చర్యలు తీసుకుంటాం.

జగనోరా వైరస్ కి వ్యాక్సిన్ ఓటు.. ఓటు హక్కు వినియోగించుకోండి.

జగన్ పాలనలో పరిశ్రమలు అన్ని ఇతర రాష్ట్రాలకు తరలి పోతున్నాయి. పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తే రవాణా రంగం కూడా బాగుపడుతుంది.

చైతన్య రథం తయారు చేసిన ఆటో నగర్ ని నేను మర్చిపోను. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో నగర్ లను అభివృద్ధి చేసే బాధ్యత నేను తీసుకుంటా.

మీకు కావాల్సిన పాలసీలు ఇస్తాం. రిటర్న్ గిఫ్ట్ గా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించండి.

# నిర్మల్ మాస్టర్ ప్లాన్ రద్దు వ్యవహారం

## బిజెపి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దీక్షభగ్నం - పోలీసుల తీరుపై మండిపడ్డ బిజెపి నేతలు

నిర్మల్,ఆగస్ట్21
నిర్మల్ మాస్టర్ ప్లాన్ రద్దు కోరుతూ నిర్మల్ మాజీ ఎమ్మెల్యే బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఐదు రోజులుగా చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. సోమవారం తెల్లవారు జామున అయనను అదుపులోకి తీసుకొన్నారు. వైద్య పరీక్షల నిమిత్తం ఆయనను జిల్లా ఆసుపత్రి తరలించారు. ఈ టైంలో అక్కడ కాసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆమరణ నిరాహార దీక్షని భగ్నం చేసేందుకు వచ్చిన పోలీసులను బిజెపి నేతలు అడ్డుకున్నారు. ముందు గేట్‌కి తాళం వేసి పోలీసులను లోనికి రానివ్వలేదు. పోలీస్ గో బ్యాక్ అంటూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో గేటు తాళం పగులగొట్టి పోలీసులు మహేశ్వర్ రెడ్డి ఇంటి లోపలికి ప్రవేశించారు. పోలీసులను బీజేపీ నేతలు అడ్డుకునే క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. వైద్య పరీక్షలు చేసుకోవాలని మహేశ్వర్ రెడ్డికి పోలీసులు సూచించినా అయన నిరాకరించారు. ఉదయం తెల్లవారు జామున 3గంటల సమయంలో ఆయన నివాసంలో పోలీసులు భారీగా మోహరించి, బలవంతంగా ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మహేశ్వర్ రెడ్డి మాత్రం మాస్టర్ ఎ÷–లాన్ జీవో 220 రద్దు చేసే వరకు తన దీక్ష విరమించబోనని ఆసుపత్రిలో పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్ రద్దు కోరుతూ మహేశ్వర్‌రెడ్డి చేస్తున్న దీక్షలు బీజేపీ నేతలు భారీగా వచ్చి మద్దతు తెలిపారు. కిషన్, బండి సంజయ్, డీకే అరుణ, ధర్మపురి అరవింద్ సంఘీభావం తెలిపారు. కొందరు నేరుగా వెళ్లి ఆయనతో మాట్లాడి మద్దతుగా నిలిస్తే మరికొందరు ఫోన్‌లో పరామర్శిం చారు. బీజేపీ సీనియర్ లీడర్లు డీకే అరుణ్, ధర్మపురి అరవింద్ ఆదివారం మహేశ్వర్‌రెడ్డి ఇంటికి వెళ్లేందుకు విఫల యత్నం చేశారు. పోలీసులు అడ్డుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆరోగ్యం క్షీణిస్తుందని వైద్యులు చెప్పడంతో ఆదివారం నాడు కట్టిదిట్టమైన భద్రత చేపట్టారు. అటుగా ఎవర్నీ రానీయలేదు. డీకే అరుణ, అరవింద్‌ను కూడా మహేశ్వర్ రెడ్డిని పరామర్శించేందుకు అనుమతి ఇవ్వలేదు. మాస్టర్ ఎ÷–లాన్ రద్దు కోరుతూ బీజేపీ శ్రేణులు నిర్మల్‌లో రెండోరోజు ఆందోళన కొనసాగించాయి. పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు బైల్‌బజార్ చౌరాస్తాలో బైఠాయించారు. అక్కడి నుంచి నేరుగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు బయల్దేరారు. మార్గ మధ్యలోనే పోలీసులు వారిని అడ్డుకొని స్టేషన్‌కు
తరలించారు. ఈ క్రమంలో కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. పరిస్థితి అదుపు చేసేందుకు పోలీసులు స్వల్ప లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. మహేశ్వర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై హోంశాఖ మంత్రి అమిత్‌షా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆరా తీశారు. లాఠీచార్జ్ చేసిన విషయాన్ని కూడా అడిగి తెలుసుకున్నారు. ఇవాళ కిషన్ రెడ్డి, ఇన్‌ఛార్జి ప్రకాష్ జవదేకర్ నిర్మల్ రానున్నట్టు తెలుస్తోంది. మరోవైపు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఇంటి ముట్టడికి బీజేపీ శ్రేణులు యత్నించడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా తప్పుపడుతోంది.పోటాపోటీ రాజకీయ వ్యూహాలతో నిర్మల్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.

# ఎపి ఆర్థిక పరిస్థితి మరీ అధ్వాన్నం

## - రాష్ట్రాన్ని చక్కబెట్టడంలో జగన్ విఫలం

## - మండిపడ్డ బిజెపి నేతలు

విజయవాడ,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): ఏపీ విభజన జరిగాక రాష్ట్రానికి దిశ, దశ లేకుండా పోయిందని బిజెపి నేత విష్ణువర్దన్ రెడ్డి అన్నారు. 13 ఉమ్మడి జిల్లాల్లో ఉన్న వనరులు, సముద్ర తీర ప్రాంతాలను వినియోగించు కోవాలన్నారు. ఏపీని పాలించిన గత, ప్రస్తుత పాలకులు అంచనాలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిని సరైన మార్గంలో తీసుకెళ్లలేదని, అనవసర అంశాలను ప్రస్తావిస్తూ రాష్ట్ర అభివృద్ధి లేకుండా చేశారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఏపీని ఆదుకునేందుకు మోదీ నిధులు ఇచ్చారని బీజేపీ నేత అన్నారు. ఏ రాష్ట్రానికి ఇవ్వనన్ని నిధులు ఏపీకి ఇచ్చారని తెలిపారు. లోటు బడ్జెట్ కారణంగా ఏపీ నుంచి కేంద్రానికి వెళ్తుంది తక్కువే అన్నారు. ప్రత్యేక ప్యాకేజీ ద్వారా వేల కోట్ల రుణాన్ని కేంద్రం చెల్లించేలా అంగీకారం ఉందని తెలిపారు. ఏపీకి కేంద్ర నిధులపై ప్రాంతీయ పార్టీలు చర్చకు రావాలని పిలుపునిచ్చారు. ఏపీకి ఇస్తున్న ప్రతి రూపాయిని గణాంకాలతో సహా వివరిస్తామని ఫేర్కొన్నారు. ఏపీలో ఆర్థిక సంక్షోభం నెలకొందని తెలిపారు. బడ్జెట్ ఎలా రూపొందించాలో కేంద్ర బడ్జెట్‌ను చూడాలని.. ఎలా రూపొందించ కూడదో తెలుసుకోవాలంటే.. ఏపీ బడ్జెట్‌ను చూడాలన్నారు. ఆదాయాలు చూసుకోకుండా డబ్బు ఖర్చుపెడితే బాగుపడినవారు లేరన్నారు. అప్పుల భారం మొత్తం రేపు ఏపీ ప్రజలు మోయాల్సిందేనని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు ఎలా అమలు చేస్తారో.. చెప్పే నిబంధన రావాలన్నారు.

# సామాన్యుడి సంక్షేమానికి కెసిఆర్ పెద్దపీట

## వ్యవసాయరంగంలో తిరుగులేని ఆధిక్యం - మంత్రి వేమల ప్రశాంతరెడ్డి వెల్లడి

నిజామాబాద్,ఆగస్ట్21
సీఎం కేసీఆర్ పాలనలో వ్యవసాయం బాగుపడిందని మంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. మల్లన్న సాగర్ సాకారంతో కాళేశ్వరం కల పూర్తిగా సాకారం అయ్యిందన్నారు. తెలంగాణను కోటిఎకరాల మాగాణిగా తీర్చిదిద్దాలని సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, సీఎం అద్భుత పాలనతో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. విపక్షాలు విమర్శలు మాని,మల్లన్న సాగర్‌ను, కొండపోచమ్మ సాగర్‌ను చూస్తే నీటి రాక ఎలా ఉందో తెలుస్తుందన్నారు. ప్రాజెక్టులకు నిధులతో సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. కాగితం పులులు, సోషల్‌మీడియాలో దుష్ప్రచారంతో పబ్బం గడుపుతున్న ప్రతిపక్షాలకు మల్లన్న సాగర్ చెంపపెట్టుగా మారిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల కోసమే ఆలోచించే ప్రభుత్వమని రుజువైందని తెలిపారు. అనేక సంక్షేమకార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని అన్నారు. టీఎస్ఐపాస్ ద్వారా ఐటీ రంగంలో మెరుగైన ప్రగతిని సాధించుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను దేశంలోనే సురక్షితమైన నగరంగా తీర్చిదిద్దామన్నారు. విమర్శలు చేస్తున్న బిజెపి నేతలు కేంద్రం ఏం చేసిందో చెప్పాలన్నారు. పెట్రో దరలు పెంచడం తప్ప చేసిందేమీ లేదన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రతి ఏటా రూ. 40వేల కోట్లు కేటాయింపులు చేసినట్లు తెలిపారు. వృద్ధాప్య పెన్షన్ అర్హత 65 ఏళ్ల నుంచి 57 ఏళ్లకు తగ్గింపు చేయడం జరిగిందని, ఒంటరి హహిళలు, దివ్యాంగుల, వితంతువుల పెన్షన్లు రెట్టింపు చేశామన్నారు. రైతులకు ఏడాదికి రూ. పదివేల పంట పెట్టుబడి ఇస్తున్నామని, అభివృద్ధి సంక్షేమంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. కుల, మతాలతో సంబంధం లేకుండా డబుల్‌బెడ్ రూం ఇండ్లు ఇస్తున్న ప్రభుత్వం తెరాసేనని మంత్రి అన్నారు. రైతుల అభివృద్ధి కోసం రూ. 50 వేల కోట్లకు పైగా కేటాయించడం గొప్ప విషయమని, తద్వారా రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు నిర్మూలించగలిగామని అన్నారు. వ్యవసా యాన్ని పండగలా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని, తెలంగాణ ఏర్పడితే కరెంట్ ఉండదని సమైక్య పాలకులు భయపెట్టారని, సీఎం కేసీఆర్ కృషితో 24 గంటల నిరంతర నాణ్యమైన కరెంట్ అందివ్వగలుగుతున్నా మని అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామిని నెరవేర్చినట్లు ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు జిల్లాల విభజన, మండలాల ఏర్పాటు చేయలేక అభివృద్ధి కుంటపడిందని అన్నారు. చిన్న మండలాలు, జిల్లాల ఏర్పాటుతో అభివృద్ధి ఫలాలు ప్రతిఒక్కరికి అందుతాయనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ జిల్లాలను, మండలాలను ఏర్పాటు చేశారన్నారు. ఇలా అన్ని రంగాల్లో కేసీఆర్ తన అద్భుతమైన ఆలోచనతో, అన్ని వర్గాల ప్రజలు బాగు పడాలనే దృకత్వంతో ముందుకెళ్తున్నారని మంత్రి వేముల అన్నారు.

# వీధికుక్కల తరలింపున ప్రక్రియ

## - తక్షణమే నిర్ణయాలు అమలు జరగాలి

హైదరాబాద్,ఆగస్ట్21 గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు శివారు మున్సిపాలిటీల పరిధిలో వీధి కుక్కల బెడదను నివారించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని నగర పౌరులు కోరుతున్నారు. ఊరకుక్కలను తరలిస్తామని చెప్పడంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకునే అవకాశం వచ్చింది. అయితే ఈ ప్రక్రియను వీలయినంత త్వరగా ప్రారంభించి ప్రజలకు భరోసా కల్పించాలని హైదరాబాద్ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్ కె. కాశీనాథ్ కోరారు. సమస్యలను తెలుసుకుని అందుకు చర్యలకు ఉపక్రమించాలన్నారు. నగరంలో పెంచుకునే కుక్కల వల్ల కూడా ప్రమాదాలు రాకుండా వారి యజమానుల నుంచి నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. ఇదిలావుంటే గ్రేటర్‌తో పాటు శివారు మున్సిపాలిటీల పరిధిలో వీధి కుక్కల బెడదను నివారించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వివిధ విభాగాల అధికారులతో కలిసి అర్వింద్‌కుమార్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న హోటల్స్, రెస్టారెంట్స్, ఫంక్షన్ హాల్స్, చికెన్ , మటన్ సెంటర్లు వ్యర్థాలను వీధుల్లో వేయకుండా కట్టడి చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. నగరంలో కుక్కల సంఖ్యను నిరోధించడానికి తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పెంపుడు కుక్కలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అర్వింద్‌కుమార్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు, హోర్డింగ్స్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నగర, మున్సిపాలిటీల పరిధిలో ఉన్న స్లమ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్స్, టౌన్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్స్, రెసిడెంట్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్స్ సహకారంతో నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీల్లో మెప్మా స్వయం సహాయక బృందాలతో నియంత్రణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పెంపుడు జంతువుల నమోదుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను సిద్ధం చేయాలని అధికారులకు అర్వింద్‌కుమార్ సూచించారు. ఇది మంచి నిర్ణయమని కాశీనాద్ అన్నారు. ఈ పని తక్షణమే అమలయ్యేలా చూడాలన్నారు.